క్లుప్తంగా

ఎంఈఓ, నోడల్ అధికారులకు సన్మానం



దామరగిద్ద: మండలంలో ఎంఈఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఎంఈఓ వెంకటయ్యను, నోడల్ అధికారిగా పనిచేసిన జీహెచ్ఎం బాలాజీని శుక్రవారం స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో హెచ్ఎం జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్ఎంలు పాల్గొని మాట్లాడారు. ఎంఈఓగా వెంకటయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ నాయక్, హెచ్ఎం జ్యోతి విశ్వనాథ్, బాలాజీ, సత్యనారాయణరెడ్డి శ్రీనివాస్, దశరథ్ బాలాజీ, వెంకట్‌నాయక్ సీఆర్పీ ఉషనప్ప, మహిపాల్ పాల్గొన్నారు.

డీటీ శ్రీనివాస్‌కు సన్మానం



మరికల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌కు విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ నర్వకు బదిలీపై వెళ్లడంతో శుక్రవారం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీతతోపాటు ఇతర సిబ్బంది ఆయనను సన్మానించి సేవలను గుర్తు చేసుకున్నారు. మరికల్ ఉప తహసీల్దార్‌కు లతారెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రావు, చరణ్‌తేజ, హన్మంతు, శిరీష, శివ, నాగమణి, జయమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీటీగా సురేష్



మాగనూర్: మండల ఉప తహసీల్దార్‌గా సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన అమీర్ ఉట్కూర్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అదేవిధంగా ఉట్కూర్ మండల కార్యాలయంలో ఉప తహసీల్దార్ నిర్వహిస్తున్న సురేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు.. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

పీఎం విశ్వకర్మయోజన జాతీయ స్టీరింగ్ కమిటీ ఎన్నిక



నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా కోటకొండకు చెందిన పగడాకుల శ్రీనివాసులు నియామితులయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన కులాలను కేంద్రం గుర్తించి 18రకా ల కుల వృత్తులకు ప్రయోజనం చేకూర్చే విధంగా పథకం రూ పొందించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించడంపై పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. నియామకం తర్వాత కలెక్టర్ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

డాక్టర్‌పై దాడి : కేసు నమోదు

మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కొందరు వ్యక్తులు తాగిన మైకంలో డాక్టర్‌పై దాడికి పాల్పడ్డారు. వివరాలిలా.. మండలంలోని చిట్యాలకు చెందిన రాము, ఈర్లదిన్నెకు చెందిన శివ, నవీన్ ద్విచక్రవాహనంపై చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారు ఆస్పత్రి సిబ్బందితోపాటు డాక్టర్‌తో గొడవపడి దాడి చేశారు. ఈ ఘటనపై వైద్య సిబ్బంది సమాచారం ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

హరిత మొక్కలను కాపాడుకుందాం

అమరచింత: ప్రధాన రహదారుల వెంట నాటిన హరిత మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీఓ నరసింహులు కోరారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శుక్రవారం చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని, పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ హరిత మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని, ఉపాధి హామీ కూలీలతో ప్రతినిత్యం మొక్కలను నీటిని అందించడానికి వాచర్లను నియమించిదని తెలిపారు. వేసవి ఎండలు ముదురుతున్నందున క్రమం తప్పకుండా రోజుకు రెండు సార్లు మొక్కలకు నీటిని అందించాలని ఆదేశించారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, నిత్యం ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. మురుగుకాల్వల పరిశుభ్రతకు కార్యచరణ రూపొందించాలని కార్యదర్శులకు సూచించారున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



ఊట్కూరులో ర్యాలీలో పాల్గొన్న నాయకులు



మాగనూర్‌లో మాట్లాడుతున్న పి. ఆంజనేయులు

కదం తొక్కిన కార్మిక లోకం

నారాయణపేట: కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఏకంకావాలని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఎంఎల్ ప్రజాపంథ జిల్లా కార్యదర్శి బి.రాము, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. అంతకుముందు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడారు.. స్కీముల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఆశలను,మధ్యాహ్నభోజన కార్మికులను, క్షేత్రసహాయకులను రెగ్యులర్ చేయాలని వారికి కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కాశీనాథ్, నరసింహ, ప్రశాంత్, కాశప్ప, దస్తప్ప, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు జయలక్ష్మి పాల్గొన్నారు.

మక్తల్: రైతులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడాలని ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ భుటో అన్నారు. శుక్రవారం గ్రామీణ బంద్‌లో భాగంగా పట్టణంలోని కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న, సీపీఐ మాస్‌లైన్‌నాయకులు కిరణ్, ఐఎఫ్టీయూ జిల్లా కో శాధికారి రాములు, సీఐటీయూ జిల్లా నాయకులు గోవింద్‌రాజు పాల్గొన్నారు.

మాగనూర్: కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని జిల్లా కో కన్వీనర్ పి. ఆంజనేయులు కార్మిక, కర్షకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాలలో కార్మికులుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు భరత్‌కుమార్, ఎస్ ఆంజనేయులు, వాకిటి వెంకటయ్య, గొల్ల నరేష్, నర్సింహులు పాల్గొన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న నాయకులు

కృష్ణా: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం మండలంలోని ఖాన్‌దొడ్డిలో పీవైఎల్, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రధాని మోదీ దిష్టి బొమ్మను వారు దహనం చేశారు. అనంతరం సంఘం అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీ పెంచాలన్నారు. ఇందులో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని గ్రామీణ భారత్‌బంద్ సందర్భంగా ఏఐటీయూసి, సీపీఐఎంఎల్ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఊట్కూరు, బిజ్వార్, పులిమామిడి, పెద్దపొర్ల తదితర గ్రామాల్లో దుకాణాలను మూసివేశారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సలీం, నారాయణ, ఇందిరా, సిద్ధూ, ఈశ్వర్, చెన్నప్ప పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రధాని మోదీ రైతాంగా వ్యతిరేక విధానాలను మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్‌లో భాగంగా మండల కేంద్రలో రైతులతో కలిసి ట్రాక్టర్‌ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కార్మిక రైతు వ్యతిరేక విధానాలను మానకోకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో జోషి, శివకుమార్, మోహన్, మొగులప్ప, మల్లేష్, హన్మంతు, బాల్‌రాజ్, తాయప్ప మధు, మహేష్, చంద్రప్ప, రామస్వామి, రాధ, ఈశ్వరమ్మ, నాగజ్యోతి పాల్గొన్నారు.

కోస్గి(మద్దూరు): రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాల పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. స్థానిక పాతబస్టాండ్ చౌరస్తాలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ఎఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కొండ నర్సింహులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలోగత మూడు రోజులుగా రైతుల సంఘాల ఆధ్వర్యంలో రైతు ధర్నా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ధర్నాను భగ్నం చేయడానికి రహదారులను దిగ్బందం చేస్తూ ఉద్యమాన్ని అణిచి వేయాలని చూస్తోందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ జయరాములుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, కొండన్న, శ్రీహరి, విజయ్, అంజి, హన్మంతు, సత్యనారాయణ, అనంతయ్య, చంద్రకళ, భాగ్య, సౌభగ్య, లక్ష్మి పాల్గొన్నారు.



దామరగిద్దలో మాట్లాడుతున్న గోపాల్



కృష్ణాలో..

ఘనంగా రథ సప్తమి వేడుకలు



శిశుమందిర్ స్కూల్‌లో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



తీలేర్‌లో రథసప్తమి వేడుకలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో రథసప్తమి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సరాఫ్‌బజార్‌లోని శ్రీ పాండురంగస్వామి ఆలయంలో సూర్యభగవానుడి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం, అర్చన, హారతి నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్, శ్రీహంసవాహిని స్కూల్‌లో రథసప్తమిని పురస్కరించుకుని విద్యార్థులు సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాఠశాల సలహాదారులు మశ్చందర్ హాజరై సూర్య నమస్కారాలతో కలిగే లాభాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని తీలేర్‌లో టీడీడీ ఆధ్వర్యంలో శుక్రవారం రథ సప్తమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి విద్యార్థులచే సూర్య నమస్కారాలు చేయించారు. అనంతరం రథసప్తమి పూజలు చేసిపూజ ఔనత్యాన్ని వివరించారు. టీడీడీ ధర్మ ప్రచారకులు కృష్ణయ, రాంచందర్‌గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం రథసప్తమి సందర్భంగా విద్యార్థులు సామూహిక సూర్యనమస్కారాల్లో పాల్గొన్నారు. సుమారు 80మంది బాలబాలికలు ఉదయం వేళలో సూర్యనమస్కారాలు ప్రదర్శించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం భీంరాజ్, ఉపాధ్యాయులు అరుణ్, లక్ష్మీ, రామాంజనేయులు, సందీప్ పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో సూర్యనమస్కారాల్లో పాల్గొన్న విద్యార్థులు

20న విజయ సంకల్ప బస్సుయాత్ర



కృష్ణా: ఈ నెల 20న బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో విజయ సంకల్పయాత్రను చేపడుతున్నట్లు కో -ఆర్డినేటర్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కృష్ణానది పుష్కర ఘాట్‌లోని కృష్ణమ్మ విగ్రహానికి పూజలు చేసి మాట్లాడారు. అంతకుముందు బస్సు యాత్రకు సంబంధించి ఆ ప్రాంత పరిసరాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17పార్లమెంట్ సీట్లలో ప్రతి అభ్యర్థిని గెలుపించుకునేందుకు ఈ యాత్రను చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ యాత్ర మొదట కృష్ణా మండలం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సంకల్పయాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరై విజయవంతం చేసేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, పడాకుల బాల్‌రాజ్, బంటు రమేష్, అమర్‌కుమార్ దీక్షిత్, బల్‌రాంరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'పది'లో వందశాతం మార్కులు సాధించాలి

మక్తల్: ప్రతి విద్యార్థి మొదట పరీక్షలంటే భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదారం మద్దునూరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో జాగ్రత్తలు తగు సూచనలు అందించారు. అనంతరం బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పదోతరగతిలో వందశాతం మార్కులు సాధిస్తే 10తులాల వెండిని బహుకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్ యాదవ్, గోపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, కట్ట సురేష్, హన్మంత్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న శ్రీపాదారం మద్దునూరి

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

మరికల్: ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ శ్రీకళ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు లేకుండా జరిగిన మొదటి మండల సమావేశం కావడంతో కేవలం గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, ఇతర సబంధిత శాఖ అధికారులు, ఎంపీటీసీలు మాత్రమే సమావేశానికి హాజరైయ్యారు. సభ ప్రారంభం కాగానే ప్రత్యేక అధికారులు ఎంపీపీ ఎదుట గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, అలాగే పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఇందుకు గాను గ్రామ కార్యదర్శులు ప్రత్యేక అధికారులకు సహకరించాలని సూచించారు. సర్పంచ్‌లు లేకపోవడంతో సభ వాడి వేడి తగ్గి నామమాత్రంగా సాగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, వైస్ ఎంపీపీ రవికుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



ఎంపీపీకి సమస్యలను వివరిస్తున్న అధికారులు

వైభవంగా ఎల్లమ్మ బండారు ఉత్సవాలు



పసుపు బండారును ఒకరిపై ఒకరు చల్లుకుంటున్న బంధువులు

మక్తల్: పట్టణంలోని శుక్రవారం ఎల్లమ్మ దేవర బండారు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో బండారు ఉత్సవాల్లో ఆయా గ్రామాల నుంచి గొల్లకురుమ కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొని పసుపు బండారును ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. అనంతరం అమ్మవారికి బండారు సమర్పించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి మేకలను, గొర్రెలను బలి ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి కృషి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఆరోవార్డు పరిధిలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం వరకు ఉన్న రోడ్డుతో పాటు పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. ఈ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

నారాయణపేట రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగండ్ల వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘనిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫీజుల పేరుతో విద్యార్థులను వేదిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అధనంగా వసూలు చేస్తున్న రుసుంపై దృష్టి సారించాలని కోరారు. రవి, వెంకటేష్, కురుమయ్య పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చర్చి నిర్మాణాన్ని నిలిపివేయాలి

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టిన చర్చి పనులను వెంటనే నిలిపివేయాలని భజరంగ్‌దళ్ మండల నాయకులు డీజే రవి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ మల్లారెడ్డిని కలిసి అక్రమంగా 341, 342,343 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన చర్చిని ఆపాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నిర్మాణంపై పంచాయతీ సిబ్బంది నోటీస్‌లు జారీచేసిన నిర్మాణం అపలేదన్నారు. గ్రామంలో కొందరు పాస్టర్‌లు అమాయకపు దళితులను లక్ష్యంగా చేసుకోని మతమార్పిడులకు పాల్పడుతున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో భజరంగ్‌దళ్ నాయకులు రవికుమార్ రెడ్డి, గ్రామస్తులు ఆంజనేయులు, ఎం.లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, నరేష్‌శెట్టి, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాము, రవి, రాజశేఖర్, గోవర్ధన్, వీహెచ్‌పీ నాయకులు నర్సింహాగౌడ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోస్గి(మద్దూరు): మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా రాధిక, డీఈఓగా మో నికా, ఎంఈఓ భారతి, హెచ్ఎంగా అనుష ఉపాధ్యాయులు వ్యవహించారు. చక్కగా బోధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కోస్గి(మద్దూరు): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ చేతుల మీదుగా మండలంలోని 50మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మిగిలిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను త్వరలో పంపిణీ చేస్తామని తహసీల్దార్ జయరాములు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు

మార్మోగిన శివనామస్మరణ



నారాయణపేటలో జ్ఞాపిక అందిస్తున్న కాకర్ల భీమయ్య

నారాయణపేట రూరల్: శివ నామస్మరణ చేయడంతో మోక్షానికి మార్గం లభిస్తుందని అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని జంగిటి మల్లేష్ ఇంట్లో నిర్వహించిన శివ స్వాముల పడిపూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శబరిపీఠం సన్నిధానం గురుస్వామి వెంకటేష్‌తో కలిసి స్వామివారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతిర్లింగ చిత్రపటం జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో గౌరిశంకర్, నాగరాజు, శ్రీనివాస్, శ్రీధర్, ఆనంద్, రఘు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని శివనామ స్మరణతో శుక్రవారం శివాలయం మార్మోగింది. శుక్రవారం అర్చకులు మహానందస్వామి, సిద్దయ్యస్వామి రథసప్తమి సందర్భంగా శివస్వాములకు నిర్వహించే పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మెట్లపూజ, పంచామృతాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర ప్రత్యేక భజనలు చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన శివస్వాములకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున శివస్వాములు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శివభక్తులు అర్థమండల దీక్షను ప్రారంభించారు. గురుస్వాములు, ఆలయ అర్చకుల సమక్షంలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీక్షను పొందిన శివస్వాములకు దాత దేశాయ్‌పల్లి పద్మమ్మ వెంకట్‌రెడ్డి దంపతులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, స్వప్న, అభినయ్‌రెడ్డి, వాణిశ్రీరాంచంద్రారెడ్డి, జయశ్రీ బస్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



నర్వలో పడిపూజలో పాల్గొన్న శివభక్తులు